Office Of The Advisor (communications)
Govt. Of Andhra Pradesh

# మహిళలదే నడుస్తున్న శతాబ్ది

## తొలి జాతీయ మహిళా పార్లమెంటులో ముఖ్య అతిథి దలైలామా ఉద్ఘాటన

## నాలుగో పారిశ్రామిక విప్లవంలో మహిళలదే ప్రధాన భూమిక : చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 10 : మానవాళిని వేధిస్తున్న సమస్యలు ప్రపంచంలో అనేకం వుండగా, ఇంకా మహిళలు, పురుషులంటూ వ్యత్యాసం చూపడం సరికాదని బౌద్ధ గురువు దలైలామా అభిప్రాయపడ్డారు. లింగవివక్షను వదిలేసి మానవత్వంపై ఆలోచించాల్సిన సందర్భం ఇదేనని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ ఏక మానవాళి గురించే ఆలోచించాలని ఆయన పిలుపునిచ్చారు. అమరావతి పవిత్ర సంగమ క్షేత్రంలో దేశంలో మొదటిసారిగా నిర్వహించిన జాతీయ మహిళా పార్లమెంటు మూడు రోజుల కార్యక్రమం తొలిరోజు సదస్సును ప్రారంభిస్తూ బౌద్ధ గురువు మాట్లాడారు. మహిళలకు గౌరవం ఇచ్చే సమాజంలో సుఖశాంతులు వర్ధిల్లుతాయని అన్నారు. ఆకాశంలో సగంగా భావించే స్త్రీమూర్తులను సగౌరవంగా చూడటమే అన్నింటికీ శ్రేయస్కరమని చెప్పారు.

అతివలకు అన్ని రంగాల్లో ప్రావీణ్యం ఉంటుందని చెబుతూ, బాల్యం నుంచే ఆడబిడ్డలను ప్రోత్సహించడం అవసరమని దయాసింధు దలైలామా చెప్పారు. చదువుకునే అవకాశం అందించడమే కాకుండా అన్ని రంగాలలో వారికి పురుషులే అండగా నిలబడాలని చెప్పారు. ప్రస్తుత విద్యావిధానం సరిగాలేదని దలై లామా ఆవేదన వ్యక్తంచేశారు. డబ్బు సంపాదించడమే పరమార్థంగా మారిందని అన్నారు. సంపాదన ఒక్కటే లక్ష్యం కాకూడదని, పౌర సమాజం శాంతి సౌఖ్యాల కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని హితవుపలికారు.

ఈ శతాబ్దం మహిళలదే కావాలని దలైలామా ఆకాంక్షించారు. మహిళల విద్య, స్వావలంబన దిశగా కృషి చేస్తే సాధికారిత తప్పకుండా సాధ్యపడుతుందని అన్నారు. ప్రపంచంలో ఏదో మూల ఒకరిని ఒకరు చంపుకుంటున్న ఉదంతాలు చూస్తున్నామని చెబుతూ, అంతర్గత శాంతి లేకుండా బాహ్య శాంతి సాధించలేమని అన్నారు. వ్యక్తిగత క్రమశిక్షణ, విలువలతో కూడిన జీవన విధానాలతో సౌభ్రాతృత్వ భావన పెంపొందించుకోవాలని చెప్పారు.

## నవీన మహిళలదే నాలుగో పారిశ్రామిక విప్లవం: చంద్రబాబు

రానున్న విజ్ఞాన విప్లవంలో కీలక భూమిక మహిళలదేనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పారు. గడిచిన పారిశ్రామిక విప్లవాల్లో మహిళలకు పెద్దగా అవకాశాలు దక్కలేదని, ఇప్పుడొస్తున్న నాలుగో పారిశ్రామిక విప్లవం మహిళలకు అద్భుతమైన అవకాశాలను అందించనున్నదని చెప్పారు. మహిళా సాధికారత కోసం ఏపీ ఎంతో చేస్తోందని అన్నారు. ముఖ్యంగా తాము ప్రారంభించిన డ్వాక్రా సంఘాల్లోని మహిళలు సమాజానికి నాయకత్వం వహించేలా ఎదుగుతున్నారని, ఈ రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిలో వారు కీలక భాగస్వాములుగా వున్నారని అన్నారు. మహిళలకు విద్య నేర్పించాల్సిన అవసరాన్ని ఆనాడే తమ నాయకుడు ఎన్టీఆర్ గుర్తించారని, స్థానిక సంస్థలలో మహిళామూర్తులకు అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కావాలని కోరిన మొదటి పార్టీ తమదేనని అన్నారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు తమ పోరాటం ఆగదని అన్నారు. మహిళా సాధికారిత సాధించేవరకు తాను విశ్రమించబోనని చెప్పారు. ఇప్పటికే చదువు, ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించామని తెలిపారు. మహిళా సాధికారతే ఒక్కటే సరిపోదని, మహిళా ఆర్థిక స్వావలంబన ముఖ్యమని అభిప్రాయపడ్డారు. రానున్న జూన్ నాటికి రాష్ట్రంలో వంతశాతం గ్యాస్ కనెక్షన్లు అందించి పొగచూరు లేని వంటిళ్లు గల రాష్ట్రంగా గుర్తింపు సాధిస్తామని ప్రకటించారు.

## బస్సు డ్రైవర్లుగా మహిళలకు అవకాశం : చంద్రబాబు

ఆర్టీసీ బస్సు డ్రైవర్లుగా మహిళలకు అవకాశం ఇవ్వాలని యోచిస్తున్నామని ఇదే వేదికపై ప్రకటించారు. అత్యంత పవిత్రమైన ప్రదేశంలో తొలి జాతియ మహిళా పార్లమెంటు నిర్వహించుకుంటుండటం సంతోషంగా వుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఒకే ఏడాదిలో రెండు పుష్కరాలు ఘనంగా నిర్వహించామని, ఇప్పుడు జాతీయ మహిళా పార్లమెంట్‌ను అందరి సహకారంతో ఘనంగా నిర్వహిస్తూ మరో చరిత్ర సృష్టించామని అన్నారు. కొత్త రాజధానిలో ఇంత పెద్ద సదస్సు నిర్వహణకు చొరవ చూపిన శాసనసభ సభాపతి కోడెల శివప్రసాదరావును ఆయన అభినందించారు. అమరావతి నుంచే శాతవాహనులు ఆనాడు పరిపాలన సాగించారని, అమరావతికి ఆ చారిత్రక వారసత్వాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. అమరావతి నుంచే బౌద్ధమతం విస్తరించిందని, దలైలామా మరోమారు ఇక్కడికి రావడం ఆనందంగా వుందని చెప్పారు.

ఇందిరాగాంధీ భారత ప్రధానమంత్రిగా కీలక భూమిక పోషించారని, అలాగే, ఎంతోమంది మహిళా నేతలు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా కీలక భూమిక వహించారని చెప్పారు.

'ప్రతి మహిళా కలలు కనాలి.. దాన్ని సాకారం చేసేందుకు ప్రయత్నించాలి' అని పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి– తమ ఇంట్లో తన సతీమణి, కోడలు కుటుంబ వ్యాపారాన్ని చూసుకోవడం చూసి గర్వపడుతుంటానని చెప్పారు. మహిళా సాధికారతకు ఇదే తార్కాణమని అన్నారు. మహిళా సాధికారితతో పాటు ఇతర అంశాలపైనా దృష్టి సారించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సదస్సుకు పిలుపునిచ్చారు.

## ఆర్థిక వ్యవస్థలో మహిళలదే కీలక భూమిక

కృష్ణా–గోదావరి సంగమం దగ్గర తొలి జాతీయ మహిళా పార్లమెంటు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు చెప్పారు. ఏ అంశమైనా చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నది ప్రజాస్వామ్య ప్రాథమిక సూత్రమని చెబుతూ, మహిళా సాధికారితపై ఈ వేదికలో చర్చిస్తున్నామని అన్నారు. అన్ని రంగాల్లో మహిళలు సత్తా చాటుతున్నారని, దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడంలోనూ మహిళలదే కీలక భూమిక పోషిస్తున్నారని చెప్పారు. పురుషులు సాధించలేనిదాన్ని తొలిసారి ఒలింపిక్స్‌లో మహిళలు సాధించి చూపారని గుర్తుచేశారు.

లింగవివక్షపై ప్రపంచవ్యాప్తంగా మహిళలు ఆందోళనలు చేస్తూనే ఉన్నారని, భారత్‌కు మాత్రమే ఈ ఆందోళనలు పరిమితం కాలేదని వెంకయ్య చెప్పారు. మహిళా సాధికారిత సాధించడంలో మనమే ముందుండాలని అన్నారు. మహిళలకు అవకాశాలు కల్పిస్తే విజయాలు సాధించడం ఖాయమన్నారు. లింగ వివక్ష ఆర్థిక ప్రగతిపై ప్రభావం చూపిస్తోందన్న కేంద్ర మంత్రి–పురాణాలు, ఇతిహాసాల్లో మహిళలకే ప్రాధాన్యం ఇచ్చిన విషయాన్ని ఎత్తిచూపారు. తెలుగు రాష్ట్రాల్లో లింగ వివక్ష తక్కువగా నమోదైందని తెలిపారు. ఆస్తిలో సగభాగం మహిళలకు ఇవ్వవచ్చని నినదించింది ఎన్టీఆరేనంటూ, ఎన్టీఆర్ వచ్చాకే మహిళలకు రాజకీయాల్లో అగ్రస్థానం లభించిందని శ్లాఘించారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ మిగిలిన దేశానికి మార్గదర్శిగా ఉందని ప్రశంసించారు.

## మహిళా ఎంపీలు మరీ ఇంత తక్కువా..? : మనీషా కోయిరాల

దేశంలో మహిళా ఓటర్ల సంఖ్య 48 శాతంగా వుంటే, పార్లమెంట్‌లో మహిళా ప్రజాప్రతినిధుల సంఖ్య 11 శాతం మాత్రమే వుండటం సబబుగా లేదని ప్రఖ్యాత సినీ నటి మనీషా కోయిరాలా అన్నారు.

మహిళలు ఏ అంశంలోనూ తక్కువ కాదనే వాస్తవాన్ని పురుష సమాజం గుర్తించాల్సిన సందర్భం వచ్చిందని అన్నారు. మగబిడ్డ పుడితే ఒకలా, ఆడబిడ్డ పుడితే మరోలా ఆలోచించే రోజులు పోయాయని చెప్పారు. వినూత్నంగా ఆలోచిస్తే మంచి ఫలితాలు వస్తాయంటూ, మహిళల్లో సహజసిద్ధంగా వుండే సృజనాత్మకత వారికి ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ అవకాశాలను నవీన మహిళలు అందిపుచ్చుకోవాలని సూచించారు.

## మా దేశంలో మహిళా నాయకత్వం : బంగ్లా స్పీకర్ షర్మీన్

తమ దేశంలో మహిళా సాధికారత కోసం అవసరమైన సంస్కరణలు చేపట్టామని బంగ్లాదేశ్ స్పీకర్ షర్మీన్ చౌధురి చెప్పారు. తమ దేశంలో ప్రధానమంత్రి, స్పీకర్, ప్రతిపక్షనేత అంతా మహిళలేనన్న విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. మహిళలకు ఓర్పు, సహనం ఎంత వుందో విజయం సాధించే సత్తా కూడా అదే స్థాయిలో వుంటుందని అన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిణామాలు, మర్పులకు అనుగుణంగా మహిళలు మారి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని అమరావతిలో జరిగే ఈ సదస్సులో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు.

## నాయకత్వం మహిళలకు కొత్త కాదు: కవిత

ఆధునిక స్త్రీ చరిత్రను పునర్ లిఖిస్తుందని మహాకవి గురజాడ అప్పారావు చెప్పిన మాట గుర్తుకువస్తోందని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత చెప్పారు. గురజాడ చాటిన ఆదర్శాన్ని నేటి సమాజం అందిపుచ్చుకోవాలని అన్నారు. పశ్చిమ దేశాల్లో సైతం మహిళలపై కనిపించని అద్దంలా ఆంక్షలు అనేకం ఉన్నాయని ప్రస్తావించారు.

దేశం కోసం త్యాగాలు చేసి, నాయకత్వం వహించిన మహిళలు మన సొంతంనాయకత్వం మహిళలకు కొత్త కాదని కవిత అన్నారు. చరిత్ర చూస్తే ఇందిరాగాంధీ కంటే ముందు ఝాన్సీ లక్ష్మీభాయి, రాణి రుద్రమదేవి వంటి ధీర మహిళలు జాతిని ముందుండి నడిపించారని గుర్తుచేశారు. నాయకత్వం కొత్త కాకపోయినా వివక్ష అనేది కొత్తగా సమాజానికి జాఢ్యంగా వ్యాపించిందని అన్నారు. తన దగ్గర ఇంటర్న్‌షిప్ చేస్తానని ఎంతో మంది అబ్బాయిలు లేఖలు రాస్తుంటారని, ఈ సదస్సు స్ఫూర్తితో ఇక అమ్మాయిలు కూడా తన దగ్గరకు వస్తారని ఆశిస్తున్నానని చెప్పారు.

ఆనాటి అమరావతి వైభవాన్ని ఈనాటి అమరావతి మళ్లీ సంపాదించుకోవాలన్న ఆకాంక్షను తెలంగాణ ఎంపీ కవిత వెలిబుచ్చారు. కొత్త అమరావతి వైభవంగా తులతూగాలని కోరుకుంటున్నానని

అన్నారు. 'ఈ అమరావతి... పురాణాల్లోని అమరావతిలా వైభవం సాధించాలి' అని చెప్పారు. ఈ సదస్సుకు రావాలని సభాపతి కోడెల వ్యక్తిగతంగా కోరడంతో ఆయన వయస్సుకు గౌరవం ఇచ్చి ఇక్కడికి వచ్చానన్నారు.

మహిళ సాధికారత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత గుర్తెరగాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు చెప్పారు. సహజంగానే మహిళల్లో నాయకత్వ లక్షణాలు ఎక్కువగా ఉంటాయని, అందివచ్చిన అవకాశాలను వినియోగించుకోవడంలో నేటి మహిళలు ముందున్నారని అన్నారు. చదువుసంధ్యల్లో బాలికలదే ప్రథమ స్థానంగా వుండటం సంతోషదాయకమని, అలాగే, సాంకేతికతను సమర్థంగా వినియోగించుకోవడంలో కూడా మహిళలే ముందున్నారని కోడెల ప్రశంసించారు. వక్తృత్వ పోటీలలో గెలుపొందిన బాలికలకు ఆయన ఈ వేదికపై జ్ఞాపికలు అందించారు.

9 నిర్దిష్ట లక్ష్యాలతో అమరావతిలో జాతీయ మహిళా పార్లమెంట్ సదస్సును నిర్వహిస్తున్నట్టు సభాపతి చెప్పారు. ఆర్థిక స్వావలంబన కోసం మహిళల్లో చైతన్యం నింపేలా సదస్సు జరుగుతుందని తెలిపారు. సదస్సులో ఇంకా కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు, పాండిచ్చేరి గవర్నర్ కిరణ్ బేడి, కార్యక్రమ నిర్వాహకుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. దేశ విదేశాల నుంచి 12 వేలమంది ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు.